క్లుప్తంగా

శివారు ప్రాంతాల్లో అభివృద్ధిపై దృష్టిపెట్టాలి



సూర్యాపేట అర్బన్ : మురుగునీరు నిలిచిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నాయకులు

సూర్యాపేట అర్బన్ : సూర్యాపేట పట్టణంలోని శివారు ప్రాంతాల్లో అభివృద్ధిపై మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి అన్నారు. పోరుబాట కార్యక్రమంలో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం 17వ వార్డు అంబేద్కర్ నగర్‌లో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం టూ టౌన్ కార్యదర్శి పిండిగ నాగమణి, టూటౌన్ కమిటీ సభ్యులు శిరంశెట్టి శ్రీనివాస్, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి



ఇళ్లను పరిశీలిస్తున్న నాయకులు

చివ్వెంల : అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టపల్లి సైదులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మోదిన్‌పురంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను సందర్శించి మాట్లాడారు. ఇళ్ల నిర్మాణం పూర్తయి రెండు సంవత్సరాలు అవుతున్నా పంపిణీ చేయకపోవడంతో శిథిలావస్థకు చేరాయన్నారు. సెప్టెంబర్ 10 లోపు అర్హులైన పేదలకు ఇళ్లు ఇవ్వకుంటే, సామూహికంగా ఆక్రమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఇట్టమళ్ల స్టాలిన్, బచ్చలకూరి రాంచరణ్, సులేమాన్, సైదులు, రాంబాబు, భిక్షం, రాములమ్మ, సాలమ్మ, తిరుపతమ్మ పాల్గొన్నారు.

మద్యం మత్తులో హెడ్ కానిస్టేబుల్!

● సోషల్ మీడియాలో వైరల్

పెన్‌పహాడ్ : మద్యం మత్తులో హెడ్‌కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తుండగా కొంత మంది వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. అనాజిపురంలో వ్యవసాయ భూమి పైపులైన్ ధ్వంసం ఘటనకు సంబంధించి హెడ్‌కానిస్టేబుల్ యాదగిరి శుక్రవారం గ్రామంలో విచారణకు వెళ్లారు. అయితే విచారణ జరపకుండా పక్కనే ఉన్న రాయిపై కూర్చొని తూలుతుండటంతో తాగి వచ్చాడని ఆరోపిస్తూ కొంత మంది వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో అది వైరల్‌గా మారింది. ఈ విషయమై ఎస్‌ఐ గోపికృష్ణను వివరణ కోరగా.. హెడ్‌కానిస్టేబల్ యాదగిరి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, దీంతో రాయిపై కూర్చొని ఉన్నాడని పేర్కొన్నారు. మద్యం మత్తులో ఉన్నాడని వచ్చిన వార్తలు అవాస్తవమని ఎస్‌ఐ తెలిపారు.

గుర్తింపుకార్డుల పంపిణీ



శాంతినగర్‌లో గీత కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న శ్రీకాంత్‌గౌడ్

నాగారం : ప్రభుత్వం అందజేస్తున్న గుర్తింపు కార్డులను గీతకార్మికులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గౌడ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొల్కపురి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని శాంతినగర్ గ్రామంలో గీత కార్మికులకు ప్రభుత్వం నుంచి వచ్చిన గుర్తింపు (ఐడీ) కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గుర్తింపు కార్డులతో గీత కార్మికులకు సామాజిక, ఆర్థిక భద్రత లభిస్తుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సులభంగా పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, సందీప్‌గౌడ్, వెంకన్న గౌడ్, లింగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు ప్రారంభం

అర్వపల్లి : అర్వపల్లిలోని ఎమ్మార్సీ భవనంలో శుక్రవారం భవిత కేంద్రం భవన నిర్మాణానికి అధికారులు ముగ్గుపోసే కార్యక్రమాన్ని నిర్వహించారు. రూ.9లక్షలతో భవిత కేంద్రానికి భవనం నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ బి.బాలునాయక్, టీజీఈడబ్ల్యూఐడీసీ ఏఈ రంగారావు, ఐఈఆర్‌పీ వినీత, కట్టంగూరి కృష్ణమూర్తి, సిబ్బంది బింగి ఏడుకొండలు, వెలుగు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దంత వైద్యశిబిరం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో శుక్రవారం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ విభాగం వారు ఉచిత దంత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు దంత వైద్యపరీక్షలు జరిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు మోక్షమెప్పుడో..

● తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో ఇంకా వెలువడని లబ్ధిదారుల జాబితా
● ఇళ్ల మంజూరు కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న నిరుపేదలు



తిరుమలగిరిలో శిథిలావస్థకు చేరిన ఇల్లు

తిరుమలగిరి : రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నప్పటికీ, తిరుమలగిరి మున్సిపాలిటీలో మాత్రం పేదల సొంతింటి కల ఇంకా కలగానే మిగిలిపోతోంది. మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు ఇప్పటికే ప్రారంభం కాగా, మున్సిపాలిటీ పరిధిలో మాత్రం లబ్ధిదారుల జాబితా ఇంకా బయటకు రాలేదు. దీంతో అర్హులైన ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2వ తేదీ నుంచి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించి, ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, నిర్మాణ పనులను వేగవంతం చేసింది. తిరుమలగిరి మండలంలోని భోక్యానాయక్ తండాలో 65 ఇళ్లు, ఇతర గ్రామాల్లో 195 ఇళ్లు మంజూరై, నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. కానీ, మున్సిపాలిటీకి మంజూరైన 177 ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికలో జాప్యం జరుగుతోంది.

ఎంపికలో జాప్యం..

మున్సిపాలిటీలోని ఇందిరమ్మ కమిటీ సభ్యులు సమావేశమై, ప్రతి వార్డు నుంచి 10 నుంచి 15 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు సమాచారం. అయితే, ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి ఇళ్లు మంజూరైనట్లు అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని దరఖాస్తుదారులు వాపోతున్నారు. అధికారులు వచ్చి ఫొటోలు తీసుకెళ్లినప్పటికీ, ఇల్లు మంజూరవుతుందో లేదోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని వార్డుల్లో కమిటీ సభ్యులు, స్థానిక నాయకుల మధ్య సమన్వయం లోపం వల్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఆలస్యం అవుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ జాప్యం కారణంగా, నిజమైన అర్హులు నష్టపోతారని, పథకం పక్కదారి పడుతుందేమోనని ప్రజలు భయపడుతున్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు వెంటనే స్పందించి, అర్హులైన నిజమైన లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేయాలని మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు. పేదల సొంతింటి కల నెరవేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

లబ్ధిదారుల లిస్టు రాగానే ప్రారంభిస్తాం..

“ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల లిస్టు రాగానే పనులను ప్రారంభిస్తాం. మరో రెండు, మూడు రోజుల్లో ప్రక్రియ పూర్తవుతుంది. ప్రజలు ఆందోళన చెందవద్దు. అర్హులైన ఇళ్లులేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయి.

– మున్వర్ అలీ, మున్సిపల్ కమిషనర్

పాత ఇల్లు కూలగొట్టాము



“ ఇందిరమ్మ ఇల్లు కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాము. అర్హుల జాబితాలో వచ్చిందని మున్సిపాలిటీ అధికారులు ఫొటోలు తీసుకొని పోయారు. ఇల్లు వస్తుందనే ఆశతో పాత ఇల్లును కూలగొట్టాము. కొత్త ఇల్లు నిర్మించుకోవడానికి భూమిని చదును చేసి ఉంచాము. త్వరగా ఇల్లు మంజూరు చేస్తే ఇల్లు నిర్మించుకుంటాం.

– షేక్ సైదాబి, 12వ వార్డు, తిరుమలగిరి

ఇల్లు మొత్తం కూలిపోయింది



“ తిరుమలగిరిలో పూర్వకాలం నాటి పెంకుటిల్లు గతంలో కురిసిన వర్షాలకు కూలిపోయింది. గోడలు మాత్రమే ఉన్నాయి. ఇల్లు మొత్తం శిథిలావస్థకు చేరింది. ఇల్లు లేక పోవడంతో కిరాయి ఇంట్లో ఉంటున్నాము. అధికారులు స్పందించి మాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి. ఇల్లు మంజూరు చేస్తే పాత ఇంటి స్థలంలో నిర్మించుకుంటాం.

– కొత్తగట్టు జ్యోతి, తిరుమలగిరి

అధ్యయన కేంద్రాల్లో అడ్మిషన్లు పెంచాలి

● సార్వత్రిక విశ్వవిద్యాలయాల జాయింట్ డైరెక్టర్ ధర్మానాయక్



మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ ధర్మానాయక్

సూర్యాపేటటౌన్ : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అధ్యయన కేంద్రాల్లో అడ్మిషన్ల సంఖ్య పెంచాలని సార్వత్రిక విశ్వవిద్యాలయాల జాయింట్ డైరెక్టర్ ధర్మానాయక్ తెలిపారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ రెడ్యానాయక్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేషులుతో కలిసి శుక్రవారం జిల్లా కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో సార్వత్రిక లెర్నర్ సెంటర్ కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని తెలిపారు. కోయ, చెంచు, ట్రాన్స్ జెండర్, దివ్యాంగులకు ఉచిత అడ్మిషన్లు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రతి సంవత్సరం జాబ్ మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి లెర్నర్ సెంటర్‌లో 500 అడ్మిషన్లు పూర్తి చేయాలని సూచించారు. పరిశోధనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లు విడుదల చేసిందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఎస్ఎస్ఆర్ శాస్త్రి, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్, కౌన్సిలర్లు కవిత, వడ్డానం శ్రీనివాస్, లింగయ్య, బుక్క ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు క్రీడలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి తెలిపారు. క్రీడల వల్ల క్రమశిక్షణ, ఆరోగ్యంతోపాటు ఐక్యతా భావం పెంపొందుతుందని తెలిపారు. అనంతరం హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్‌ను స్మరించుకున్నారు. ఫిజికల్ డైరెక్టర్ చైతన్య మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని అన్నారు. అనంతరం క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సూర్యాపేట : మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదిన వేడుకలను శుక్రవారం పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా యువజన, క్రీడల అధికారి జి.రాంచందర్ రావు మాట్లాడారు. క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్, టీఎన్‌జీఓ జిల్లా సెక్రటరీ దున్న శ్యామ్, గెజిటెడ్ ఆఫీసర్స్ సెక్రటరీ డా.గోపి పాల్గొన్నారు.

భద్రత ఏర్పాట్లు పూర్తి చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఉత్సవ సమితి సభ్యులు

సూర్యాపేట : వినాయకుడి విగ్రహాల నిమజ్జన శోభాయాత్రలకు పోలీస్ బందోబస్తు, పికెటింగ్ ఏర్పాట్లు చేయించాలని భానుపురి గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్పీ కె.నరసింహకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు అనంతుల కృపాకర్ మాట్లాడారు. సూర్యాపేటలో నెలకొల్పిన ప్రతి విగ్రహానికి నంబరింగ్ ఇవ్వాలని కోరారు. నిమజ్జన రూట్ మ్యాప్‌ను ముందుగానే ఖరారు చేసి పట్టణంలోని ప్రతి విగ్రహ కమిటీకి అందజేయాలని కోరారు. ఎస్పీని కలిసిన వారిలో ప్రధాన కార్యదర్శి రంగరాజు రుక్మారావు, గౌరవ అధ్యక్షుడు ఉపేందర్ కారింగుల, చల్లమల్ల నరసింహ, ఉపాధ్యక్షుడు చక్కిలం రాజేశ్వరరావు, బైరు వెంకన్న గౌడ్, గండూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసంతోషిమాతకు పూజలు

సూర్యాపేట : పట్టణంలోని శ్రీసంతోషి మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉద్యాపన వ్రతం, ఒడిబియ్యం, మంగళ హారతి కార్యక్రమాలు జరిపారు. దేవాలయంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ అర్చకుడు బట్టారం వంశీకృష్ణశర్మ, ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశం గుప్తా, బ్రహ్మాండ్లపల్లి మురళీధర్, కోశాధికారి పాలవరపు రామమూర్తి, ఉపకోశాధికారి కొత్త మల్లికార్జున్, ఉపాధ్యక్షులు బెలిదె అశోక్, పబ్బా ప్రకాష్ రావు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 1న నిరసన

సూర్యాపేటటౌన్ : కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సెప్టెంబర్ 1న ఉపాధ్యాయులందరూ భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నిమ్మల శ్రీనివాస్, కడపర్తి శ్రీనివాస్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో జరుగుతున్న నిరసన కార్యక్రమానికి టీపీటీయూ సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

నూతనకల్ : మండల పరిధిలోని దిర్శనపల్లి, తాళ్ల సింగారం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ ప్రణయ్ శుక్రవారం తెలిపారు. మరమ్మతుల కారణంగా దిర్శనపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, తాళ్లసింగారం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి



నాగారం : వర్ధమానుకోటలో మండల స్థాయి క్రీడలను ప్రారంభిస్తున్న అధికారులు



మద్దిరాల : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

నాగారం : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని తహసీల్దార్ హరి కిషోర్‌శర్మ అన్నారు. శుక్రవారం వర్ధమానుకోట జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడలను మండల విద్యాధికారి వాసం ప్రభాకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.మారయ్య, ఎస్‌ఐ ఎం.ఐలయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎం జ్ఞానేశ్వరచారి, ప్రధానోపాధ్యాయుడు ఎండీ బురహనొద్దీన్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ యాకయ్య, ఫిజికల్ డైరెక్టర్‌లు కృష్ణమూర్తి, రమేష్, కలమ్మ, మహేశ్వరి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎస్‌ఐ వీరన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కాట్ల రవికుమార్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్వపల్లి: అర్వపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఎంఈఓ బి.బాలునాయక్, ఎస్‌ఐ ఈట సైదులు, ఎంఎన్‌ఓ కుంభం ప్రభాకర్, హెచ్‌ఎం విజయలక్ష్మి, చైర్‌పర్సన్ మేకల సునీతారాంబాబు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.



అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో క్రీడలను ప్రారంభిస్తున్న అధికారులు, పీడీలు

ఉత్సవాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



కౌన్సిలింగ్ ఇస్తున్న పట్టణ సీఐ వెంకటయ్య

సూర్యాపేటటౌన్ : గణేష్ ఉత్సవాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని పట్టణ సీఐ వెంకటయ్య అన్నారు. అత్యధిక సార్లు మద్యం సేవించి పట్టుబడిన వారిని శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు. మద్యం సేవించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా వదిలేది లేదని తెలిపారు. ఇతర మతస్తుల మనోభావాలను దెబ్బతీయకుండా, సోదరభావంతో, పరస్పర గౌరవంతో ఉత్సవాలు జరపాలని సూచించారు. ఇతరులను రెచ్చగొట్టే ప్రసంగాలు, నినాదాలు, వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ట్రాఫిక్ ఎస్‌ఐ సాయిరాం ఉన్నారు.

దాతల సహకారం అభినందనీయం



పెన్‌పహాడ్ : దోసపహాడ్ ప్రాథమికోన్నత పాఠశాలకు బీరువా అందజేస్తున్న ఏడుకొండలు



ఆత్మకూర్(ఎస్) : విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న ఒగ్గు వెంకన్న

పెన్‌పహాడ్ : పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు సహకారం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు పిండిగ నరసయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దోసపహాడ్ ప్రాథమికోన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి కొండేటి ఏడుకొండలు–జయమ్మ దంపతులు రూ.15వేలు విలువ గల బీరువాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో గ్రామస్తులు, ఉద్యోగులు, యువత భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం దాతను పాఠశాల బృందం పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ పందిరి రేణుక, ఉపాధ్యాయులు మామిడి వెంకన్న, కళ్యాణి, విజయకుమారి, వై. వెంకన్న, విప్లవకుమార్, పంచాయతీ కార్యదర్శి జానీ వర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

ఆత్మకూర్(ఎస్) : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా తుమ్మలపెన్‌పహాడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాత ఒగ్గు వెంకన్న శుక్రవారం రూ.20వేల విలువగల క్రీడా దుస్తులను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి. వెంకన్న, పీడీ బొల్లెద్దు వెంకన్న, ఉప సర్పంచ్ కళ్లంచెర్ల చంద్రయ్య, ఉపాధ్యాయులు ఎం.శ్యామ్ కుమార్, బి. లింగయ్య, నరేందర్ రెడ్డి, బాలు, గోపిరెడ్డి, శ్రీలక్ష్మి, ప్రశంస, శ్రీనివాస్, పుష్పావతి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ అందజేత

ఆత్మకూర్(ఎస్) : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌కు 300 లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌ను రిటైర్డ్ టీచర్ తల్లాడ కృష్ణమూర్తి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రవణ్ కుమార్ మాట్లాడారు. ట్యాంక్ వల్ల విద్యార్థులకు పరిశుభ్రమైన తాగు నీరు అందుబాటులోకి వస్తుందన్నారు.

ఫ్యాన్ బహూకరణ

నూతనకల్ : మండల పరిధిలోని చిల్పకుంట్ల అంగన్‌వాడీ కేంద్రానికి గ్రామానికి చెందిన బాణాల విజయ్‌కృష్ణారెడ్డి శుక్రవారం సీలింగ్ ఫ్యాన్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోంబాబు మాట్లాడారు. సీలింగ్ ఫ్యాన్‌ను బహూకరించిన దాతను అభినందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ బండపల్లి అరుణ, ఆయా పంతం సోమలక్ష్మి పాల్గొన్నారు.

నోట్‌పుస్తకాల అందజేత

నూతనకల్ : పెద నెమిల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధరావత్ శివయ్య తన సొంత ఖర్చులతో రూ.7500 విలువ గల నోట్‌పుస్తకాలను శుక్రవారం విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అరుణ, ఉపాధ్యాయులు చవగాని వెంకయ్య, హరికృష్ణాచారి, ఉమారాణి, సువర్ణలక్ష్మి, షమీమ్‌సుల్తానా, ప్రశాంతి, విజయలక్ష్మి, సుధీర్, సైదయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్ : అంగన్‌వాడీకి ఫ్యాన్ బహూకరిస్తున్న విజయ్‌కృష్ణారెడ్డి



నూతనకల్ : ప్రధానోపాధ్యాయుడు శివయ్య అందజేసిన నోట్‌పుస్తకాలతో విద్యార్థులు

నీటి కోసం ఇబ్బందులు

అర్వపల్లి : మండల పరిధిలోని అడివెంల క్రాస్ రోడ్డులో 10 రోజులుగా నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రాస్‌రోడ్డులో రక్షిత మంచినీటి పథకం బోరు మోటార్ కాలిపోగా మరమ్మతు కోసం విప్పి వదిలేశారు. అలాగే మిషన్‌భగీరథ పైపులైను పగిలి నీళ్లు వృధాగా పోతున్నాయి. నీటి సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. నీటి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇళ్ల పనుల పరిశీలన

మద్దిరాల : మండల పరిధిలోని గోరెంట్లలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సకాలంలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి బిల్లులు పొందాలని అన్నారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మాణాలను చేపట్టాలని కోరారు. అనంతరం గ్రామంలో నిర్మించిన పశువుల పాకలను పరిశీలించారు.

నేడు ముసాయిదా ఓటరు జాబితాపై సమీక్ష

పెన్‌పహాడ్ : ముసాయిదా ఓటరు జాబితాపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జానయ్య శుక్రవారం తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్‌లకు సంబంధించి అభ్యంతరాలపై చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నూతనకల్ : ముసాయిదా ఓటరు జాబితాపై మండల పరిషత్ కార్యాలయంలో శనివారం రాజకీయ నాయకులకు అవగాహన కల్పించనున్నట్లు ఎంపీడీఓ సునీత శుక్రవారం తెలిపారు. అవగాహన సదస్సుకు రాజకీయ పార్టీల నాయకులు హాజరు కావాలని ఆమె కోరారు.

ఓటరు జాబితా సరిచూసుకోవాలి

అర్వపల్లి : స్థానిక ఎన్నికల దృష్ట్యా విడుదలైన ముసాయిదా ఓటరు జాబితాను కాంగ్రెస్ శ్రేణులు సరిచూసుకొని అభ్యంతరాలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి కోరారు. శుక్రవారం ఆయన కొమ్మాలలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ధర్నా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

తిరుమలగిరి : సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని మున్సిపల్ ఉద్యోగులు శుక్రవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సీపీఎస్‌ఈయూ అసోసియేట్ అధ్యక్షుడు ఉపేందర్ మాట్లాడారు. సెప్టెంబర్ 1న జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండీ.మున్వర్‌అలీ, జిల్లా ఉపాధ్యక్షుడు పాల్వాయి వెంకన్న, తన్నీరు సురేఖ, గణపతి, సోమయ్య, శోభ, జీవన్, ధనమ్మ, శైలజ, శివ, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

గిడుగు వెంకట రామ్మూర్తికి ఘన నివాళి



పెన్‌పహాడ్ : గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



తుంగతుర్తి : విద్యాభారతి పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడికి జ్ఞాపిక ఇస్తున్న విద్యార్థులు

పెన్‌పహాడ్ : గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష కోసం రామమూర్తి పంతులు ఎనలేని సేవలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణయ్య, మారం పవిత్ర, ఉపేందర్, ఆనందభాస్కర్, వెంకటేశ్వర్లు, రాములు, శ్రీధర్, పద్మ, మహబూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని విద్యాభారతి పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. తెలుగు ఉపాధ్యాయుడు సురేష్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పందిరి మల్లయ్య, ఉపాధ్యాయులు వెంకటగోపాల్, లింగమూర్తి, రామచంద్రు, ఈరోజీ, అంబటి రమేష్, సరిత, అనిత, సునీత, రాధ, మున్ని, స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

వాగ్దానాలు నెరవేర్చాలి

చివ్వెంల : ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని సీపీఎం టుటౌన్ కార్యదర్శి పిండిగ నాగమణి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దురాజ్‌పల్లిలో ప్రజాసమస్యలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీలిన గ్రామాల్లో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోట సృజన, ఇరుగు రమణ, మంగమ్మ, రజిత, జానమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు



తిరుమలగిరిలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళా భక్తులు



నూతనకల్‌లో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు